సాక్షి
కాకినాడ
సోమవారం । 28 । అక్టోబర్ । 2024



నరసన్నకు రూ.50 వేల విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహ స్వామికి తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ వాస్తవ్యుడు పుల్లెపు త్రిమూర్తులు రూ.50 వేల విరాళం సమర్పించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆయనకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.



సత్యదేవుని నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి బొతుల వీర్రాఘవులు, సూర్యకుమారి దంపతులు (వడిశలేరు)రూ.1,00,116 విరాళాన్ని సమర్పించారు.

తొలి అడుగుకు వేళాయె..



విద్యార్థి జీవితంలో అగ్ని పరీక్ష పదో తరగతి గట్టెక్కడం. ఈ పరీక్షలు వచ్చే ఏడాది మార్చి ఏప్రిల్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

8లో

న్యూస్‌రీల్

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును టీడీపీ, జనసేనలు వ్యతిరేకించాలి

కాకినాడ సిటీ: పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రం ప్రవేశపెట్టబోయే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును టీడీపీ, జనసేన పార్టీలు వ్యతిరేకించి ముస్లింల ప్రయోజనాలు కాపాడాలని ఉమ్మడి రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు ఎండీ జహీరుద్దీన్ జిలానీ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముస్లింల మనోభావాలు దెబ్బతినే విధంగా తీసుకొస్తున్న వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును తమ టీడీపీ మిత్రపక్షం జనసేనలకు చెందిన ఎంపీలు వ్యతిరేకించాలని కోరారు. దీని వల్ల ముస్లింలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

సత్యదీక్షలు ప్రారంభం



సత్యదేవుని సన్నిధిన దీక్ష చేపట్టిన భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదీక్షలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారి జన్మనక్షత్రం 'మఖ', ఏకాదశి పర్వదినం కలిసి రావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు పసుపు వస్త్రాలు ధరించి తెల్లవారుజామున ఐదు గంటలకు ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చక స్వాములు చిట్టెం గోపీ, దత్తాత్రేయశర్మ చేతుల మీదుగా తులసి మాలలు వేయించుకుని సత్యదీక్షలు చేపట్టారు. రత్నగిరిపై సత్యదేవుని ఆలయం వద్ద, కొండ దిగువన నేరేళ్లమ్మ, వినాయకుని ఆలయాల వద్ద సుమారు 500 మంది స్థానిక భక్తులు సత్యదీక్షలు చేపట్టారు. జగ్గంపేట నియోజకవర్గంలో, అడ్డతీగలలోని ఏజెన్సీ ప్రాంతంలో మరో వేయి మంది గిరిజనులు జిల్లా వ్యాప్తంగా ఈ దీక్షలు స్వీకరించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. 27 రోజుల పాటు దీక్ష కొనసాగించి నవంబర్ 23వ తేదీన సత్యదేవుని సన్నిధిన దీక్ష విరమించనున్నారు. కాగా, ఇంటి వద్ద పీఠం పెట్టే అవకాశం లేని భక్తుల కోసం దేవస్థానం కళావేదిక మీద పీఠం ఏర్పాటు చేసింది. ఇక్కడ ఉదయం, రాత్రి జరిగే పూజల్లో సత్యదీక్ష స్వాములు పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు. ఈ పీఠం ఏర్పాటు కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్ర మోహన్ పాల్గొన్నారు.

లోవ దేవస్థానంలో భక్తుల రద్దీ

రూ.5.33 లక్షల ఆదాయం

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో రద్దీ నెలకొంది. ఆదివారం వివిధ జిల్లాల నుంచి వచ్చిన పది వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ఇన్‌చార్జ్ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. పులిహోర, లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,73,895, పూజా టికెట్లకు రూ.1,10,030, కేశఖండనశాలకు రూ.8,760, వాహన పూజలకు రూ.4050, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలు రూ.82,396, టోల్ గేటు రుసుములు రూ.55,315, విరాళాలు రూ.99,274 వెరసి మొత్తం రూ.5,33,720లు ఆదాయం సమకూరినట్టు ఈఓ వివరించారు.

విద్యుత్ చార్జీలు పెంచితే ప్రభుత్వ పతనం ఖాయం



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు మధు తదితరులు

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రజలపై రూ.6,072 కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపారని, ప్రజలు భరించలేరని, ఇదే ఇలా కొనసాగితే కూటమి ప్రభుత్వ పతనం ఖాయమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు హెచ్చరించారు. ఆదివారం కాకినాడలోపి పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2003 సంవత్సరంలో కరెంటు చార్జీల పెంచినందు వల్లే 2004లో టీడీపీ ప్రభుత్వం ఓడిపోయిందని, అది పునరావృతం అవుతుందని అన్నారు. ఎన్నికల ముందు మేము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు తగ్గిస్తామని చెప్పి ఇప్పుడు ట్రూ అప్ చార్జీలు ప్రజలపై మోపడం అన్యాయం అన్నారు. ఈ భారాన్ని ప్రభుత్వం భరించాలని మధు డిమాండ్ చేశారు. పలు సమస్యలపై మాట్లాడదామంటే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా ప్రజలకు అందుబాటులో లేరన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి ఆలోచించి జిల్లాకు మరో మంత్రిని ఇవ్వాలన్నారు. నూతన మద్యం పాలసీలో ప్రతి పేటలో బెల్ట్ షాపులు వెలిశాయని, ఆయా వార్డుల్లో తిరగడానికి మహిళలు ఇబ్బంది పడుతున్నారని, బెల్ట్ షాపులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. సీపీఐ నాయకులు కె.బోడకొండ, తోకల ప్రసాద్ పాల్గొన్నారు.

ఆగని ధరవ్వ

- నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించలేని కూటమి ప్రభుత్వం
- ప్రత్యేక కేంద్రాల్లో కందిపప్పు, బియ్యం, పామాయిల్ తక్కువ ధరకే అంటూ ప్రచారం
- నాణ్యత లేకపోవడంతో కొనేందుకు ప్రజల విముఖత
- మండల కేంద్రాల్లో నేటికీ తెరచుకోని ప్రత్యేక కేంద్రాలు



కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న కాకినాడ రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన కందిపప్పు ప్రత్యేక కౌంటర్

కాకినాడ సిటీ: రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రిస్తామని చెప్పిన ప్రభుత్వం మాటలకే పరిమితమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన కందిపప్పు, బియ్యం అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం రోజుల వ్యవధిలోనే చేతులెత్తేసింది. ఓ వైపు కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. కందిపప్పు ధర డబుల్ సెంచరీ దగ్గరకు చేరింది. ఈ తరుణంలో ధరలు దించుతామంటూ ప్రచారం చేసిన ప్రభుత్వ పెద్దలు ప్రత్యేక కేంద్రాలు, రైతుబజార్లలో కౌంటర్లు ఏర్పాటు చేశారు. తక్కువ ధరకే కందిపప్పు, బియ్యం ఇస్తామంటే ఆశపడిన పేద, మధ్యతరగతి ప్రజలు వాటి నాణ్యత, ధరలు చూసి పెదవి విరుస్తున్నారు. ఇంతోటి సంబరానికి అంతటి డప్పెందుకని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇదిలా ఉంటే ఇప్పుడు పామాయిల్ అమ్మకానికి ప్రత్యేక కౌంటర్లు తెరుస్తామని, పామాయిల్ (850 గ్రాములు) ధర రూ. 110, సన్‌ఫ్లవర్ ఆయిల్ (910 గ్రాములు) ధర రూ. 124లు అమ్మే విధంగా ధరలు నిర్ణయించినట్టు ప్రకటించారు. పామాయిల్ బయట మార్కెట్‌లో కిలో రూ. 110కి, సన్‌ఫ్లవర్ రూ.134కు దొరుకుతుంటే ప్రత్యేక కౌంటర్లలో ధర రూ.110, రూ.124లు అమ్మే విధంగా నిర్ణయించడం విడ్డూరంగా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు.

మాటలకే పరిమితమైన నాణ్యత

మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో కందిపప్పు, బియ్యం అందించే ప్రత్యేక కేంద్రాలను స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు ఆగస్టు నెలలో అట్టహాసంగా ప్రారంభించారు. కానీ ఆ కేంద్రాలతో ప్రజలకు ఒనగూరిందేమీ లేదని, ఇప్పుడు పామాయిల్ అమ్మకాల కోసం ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక కౌంటర్ల వల్ల ప్రజలకు ఏ ఉపయోగం ఉండదన్న అభిప్రాయం జిల్లా అంతటా వినిపిస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన ధరకు కందిపప్పు, బియ్యం ప్రజలు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు. కేజీ కందిపప్పు రూ.160, స్టీమ్ బియ్యం కేజీ రూ.49, బీపీటీ పచ్చి బియ్యం రూ.48 వంతున ప్రత్యేక కేంద్రాల్లో అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే బయట మార్కెట్‌లో కందిపప్పు రకాలను బట్టి రూ.160 నుంచి రూ.225 వరకు లభిస్తున్నాయి. అదే విధంగా బియ్యం కూడా రకాలను బట్టి రూ.42 నుంచి లభ్యమవుతున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కందిపప్పు, బియ్యం నాణ్యత లేకపోవడంతో పాటు ధరలలో వ్యత్యాసం నామమాత్రంగా ఉండటంతో ప్రజలు వాటి వైపు వెళ్లడమే మానేశారు.

కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తం

జిల్లాలో పలు మండలాల్లో మొదటి నెలలో ప్రత్యేక కేంద్రాలకు పప్పు, బియ్యం సరఫరా కాలేదు. రెండో నెలలో తూతూ మంత్రంగా కందిపప్పు, బియ్యం చేరాయి. అదీ నాణ్యత లేని రెండో రకం బియ్యం, కందిపప్పు సరఫరా చేశారని వినియోగదారులు అంటున్నారు. ఒక్క కాకినాడ రైతుబజారు మినహా జిల్లాలో ఏ ఒక్క మండలంలోనూ కందిపప్పు, బియ్యం పంపిణీలకు ప్రత్యేక కౌంటర్లు తెరచుకోలేదు. కొన్ని మండలాలకు సరకు పంపేందుకు రవాణా చార్జీల చెల్లింపుల్లో స్పష్టత లేక సరకుల పంపిణీ ఆగినట్టు సమాచారం. పెద్దాపురం, జగ్గంపేట, తుని, పిఠాపురం, తాళ్లరేవు, కాకినాడ రూరల్ ప్రాంతాల్లో కందిపప్పు, బియ్యం పంపిణీకి ప్రత్యేక కౌంటర్లు తెరచుకోనే లేదు. అదే విధంగా ఇప్పుడు నూనె (పామాయిల్) సరఫరా కూడా ఉంటుందని ప్రజలు పెదవి విరుస్తున్నారు. తమకు ప్రత్యేక కేంద్రాల ద్వారా కందిపప్పు, నూనె, బియ్యం పంపిణీ అమ్మకాలు వద్దని, నేరుగా రేషన్ షాపుల్లోనే వీటిని గతంలో మాదిరిగా ప్రభుత్వం నిర్ణయించిన సబ్సిడీ ధరలకు అందించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. కాకినాడ రైతుబజార్లో కందిపప్పు, బియ్యం అమ్మకాలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో వీటిని ప్రజలు కొనుగోలు చేయని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఎప్పుడు చూసినా ఆ షాపు ఖాళీగానే దర్శనమిస్తోంది.

రేషన్ దుకాణాల్లో సరకులేవీ?

రేషన్ కార్డుదారులకు కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కందిపప్పు, పంచదార, గోధుమ పిండి, పామాయిల్ తదితర సరుకుల పంపిణీకి ఎగనామం పెట్టడంపై విమర్శలు వ్యక్తమవున్నాయి. రేషన్ దుకాణాల్లో రూ.67కే లభించాల్సిన కేజీ కందిపప్పును ప్రత్యేక కేంద్రాల పేరుతో రూ.160కు విక్రయించడమేంటని ప్రజలు వేస్తున్న ప్రశ్నకు సమాధానమిచ్చే వారే లేరంటున్నారు. గతంలో రూ.50కే ఇచ్చే పామాయిల్ 910 గ్రాముల ప్యాకెట్ ఇప్పుడు రూ.110 అంటూ ప్రచారం చేస్తున్నారంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు నాణ్యమైన సరకులను డీలర్ షాపుల ద్వారా అమ్మాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



పండగలు వస్తున్నాయంటే నిత్యావసర సరుకుల ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. గత నాలుగు నెలలుగా నిత్యావసర వస్తువులు, పప్పులు, కూరగాయల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. దుకాణానికి వెళ్లి సరకులు కొనుగోలు చేయాలంటే భయమేస్తోంది. ప్రభుత్వం కందిపప్పు, బియ్యం అమ్మకాలకు రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్ తెరిచినా రేట్లలో పెద్దగా తేడా లేదు. రేషన్ షాపుల ద్వారా గతంలో మాదిరిగా సబ్సిడీ రేట్లకు నిత్యావసర వస్తువులు సరఫరా చేస్తే పేదలకు ప్రయోజనకరంగా ఉంటుంది.

–ఆతం భద్రం, కాకినాడ

రేట్లు పెరిగినా కొనుగోలు చేయక తప్పదు



అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి నేతలు ధరలు తగ్గించక పోగా రోజురోజుకూ పెంచుకుంటూ పోతున్నారు. ఈ ప్రభుత్వం ధరల నియంత్రణలో పూర్తిగా విఫలం అయింది. నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగి భారంగా మారినా కొనుగోలు చేయక తప్పడం లేదు. రెండు నెలల క్రితం బియ్యం, కంది పప్పు, ఇప్పుడు పామాయిల్‌ను ప్రత్యేక కౌంటర్ల ద్వారా అమ్మకాలు చేస్తామని ప్రకటించారు. రైతుబజార్ ఎక్కడో దూర ప్రాంతంలో ఉండడం, అక్కడ నాణ్యమైన సరకు ఉండకపోవడంతో ప్రజలు వాటిని దరి దాపులకే వెళ్లడంలేదు. ప్రభుత్వం ప్రత్యేక కౌంటర్ల ద్వారా అందించే సరుకులు పేదలకు అంటుబాటులో లేవు. రేషన్ షాపుల్లో గతంలో మాదిరిగా సబ్సిడీ ధరలకు నిత్యావసర సరకులు అందించాలి.

– జగడం శ్రీహరి, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్, తూరంగి

నిబంధనలు తుస్..



అనుమతులు రాక ముందే పూర్తి చేసిన బాణసంచా దుకాణ నిర్మాణం

- బాణసంచా అక్రమ వ్యాపారానికి కొండంత అండ
- నగర నడిబొడ్డులో చకచకా ఏర్పాట్లు
- అనుమతులు రాకముందే దుకాణం నిర్మాణం

కాకినాడ క్రైం: ప్రజల భద్రతను కనీసం పరిగణనలోకి తీసుకోకుండా టీడీపీ నేతలు పేట్రేగిపోతున్నారు. లాభార్జనే ధ్యేయంగా ప్రజల ప్రాణాలతో చెలగాటాలాడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కాకినాడ మెయిన్ రోడ్డులో రద్దీగా ఉండే టిప్సీ టాప్సీ, నీరూస్ అనే రెండు దుస్తుల షోరూంల మధ్య సుమారు 700 గజాల విస్తీర్ణంలో ఓ బాణసంచా దుకాణాన్ని సిద్ధం చేస్తున్నారు. ఆదివారం ఆ దుకాణంలో బాణసంచా సామగ్రి సైతం నిల్వ చేయడం గమనార్హం. కాగా దుకాణం బయట కాకినాడ నగర ఎంఎల్‌ఏ వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు చిత్రాలతో ఫ్లెక్సీలు దర్శనమివ్వడం, కార్లలో బడాబాబులు ఖద్దరు చొక్కాలతో దిగి దుకాణ ఏర్పాట్లు చూసుకుని వెళ్లడం చర్చనీయాంశమైంది. శ్రీ గణపతి ఫైర్ వర్క్స్ పేరుతో దుకాణ ఏర్పాటు అనుమతులు కోసం ఎంఎల్‌ఏ కొండబాబు కీలక అనుచరుడు పూర్ణ మరో అనుచరుడు ఎం.శివరామకృష్ణ పేరుతో దరఖాస్తు చేశాడు. వడ్డించే వాడు మన వాడైతే అన్న చందంగా అనుమతులు రావనే ప్రసక్తే లేదన్న ధీమాతో వ్యవహరిస్తున్నారు. పక్కనే షోరూంల యాజమానులను బెదిరించి మరీ ఎన్‌ఓసీలు డిమాండ్ చేస్తుండడం స్థానికులను విస్తుగొలుపుతోంది. ఈ దుకాణం ఏర్పాటుపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా దరఖాస్తు అందిందనీ, ఫైర్, పోలీస్, మున్సిపాలిటీ పర్యవేక్షణ జరుగుతుందని చెప్పారు. ఆ విభాగాల అధికారులు మాత్రం ముందు ఎవరు అనుమతి ఇస్తే దాని మాటున తమ అనుమతులు ఇవ్వాలని భావిస్తున్నారు. దీపావళికి ఒకటి రెండు రోజుల ముందు అనుమతులు ఇచ్చేసి తరువాత వ్యతిరేకత లేకుండా చూసుకోవాలని భావిస్తున్నారు. అనుకోని దుర్ఘటన జరిగితే రెండు షోరూంల మధ్య నుంచి ఎవరూ బయటపడే ప్రసక్తి లేదు. ప్రజల ప్రాణాలతో చెలగాటమే నన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పది పరీక్షలకు ఫీజు చెల్లించాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఈ విద్యాసంవత్సరం 10వ తరగతి వార్షిక పరీక్షలకు ఫీజు చెల్లించడానికి ఎస్ఎస్‌సీ బోర్డు షెడ్యూల్ విడుదల చేసిందని జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి వచ్చేనెల 11వ తేది వరకూ ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించవచ్చన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ నామినల్ రోల్స్‌ను కూడా ప్రధానోపాధ్యాయులు ఈ తేదీలోగా పంపించాలని సూచించారు. అన్ని సబ్జెక్టులకు (మూడు సబ్జెక్టులు మించి)రూ.120, మూడు సబ్జెక్టుల వరకూ రూ.110, ఒకేషనల్ విద్యార్థులు అదనంగా సబ్జెక్టుకు రూ.60, నిర్ణీత వయస్సు కంటే తక్కువ ఉన్నవారు రూ.300, మైగ్రేషన్ సర్టిఫికెట్‌కు రూ.60 చెల్లించాలని సూచించారు. రూ.50 ఆలస్య రుసుముతో వచ్చే నెల 18వ తేదీ, రూ.200 ఆలస్య రుసుముతో 25వతేదీ, రూ.500 లేట్ ఫీజుతో నవంబర్ 30వ తేదీలోగా చెల్లించాలని సూచించారు.

మా భూములను వదలం

- ఎయిర్‌పోర్టుకు పంట పొలాలను ఇచ్చేది లేదని స్పష్టం చేసిన రైతులు
- ఇప్పటికే పోలవరం, పుష్కర, హైవే, రైల్వే లైన్లకు ఇచ్చి నష్టపోయామని ఆవేదన
- ఖాళీగా ఉన్న కేఎస్‌ఈజెడ్ భూముల్లో ఎయిర్‌పోర్టు పెట్టుకోవాలని డిమాండ్
- బెండపూడిలో జరిగిన సమావేశంలో పలు నిర్ణయాలు



ఎయిర్‌పోర్టు ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ నినాదాలు చేస్తున్న బెండపూడి, చిన్నాయపాలెం రైతులు

తొండంగి: తరతరాల నుంచి సాగు చేసుకుంటున్న రెండు పంటలు పండే వరి భూములను వదులుకునే ప్రసక్తి లేదని బెండపూడి, పి.ఇ.చిన్నాయపాలెం ప్రతిపాదిత ఎయిర్‌పోర్టు భూముల బాధిత రైతులు స్పష్టం చేశారు. బెండపూడి, పి.ఇ.చిన్నాయపాలెం ప్రాంతాల్లో విమానాశ్రయం కోసం 757 ఎకరాల జిరాయితీ వరి పొలాలను ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనిని వ్యతిరేకిస్తూ ఆదివారం బెండపూడిలో ఈ భూములకు సంబంధించిన రైతులు సమావేశమయ్యారు. గతంలో పోలవరం కాలువ, పుష్కర కాలువ, జాతీయరహదారి నిర్మాణం, రైల్వే లైనులకు వందలాది ఎకరాలను ఇచ్చి తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ ఎయిర్‌పోర్టు పేరుతో 800 ఎకరాలను సేకరిస్తే సాగుపై ఆధారపడిన కౌలు రైతులు, కూలీలు ఇతర వర్గాల ప్రజల జీవనోపాధి పోతుందన్నారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులే అధికంగా ఉన్నామన్నారు. ప్రతిపాదించిన భూములన్నీ ప్రస్తుతం మార్కెట్‌లో ఎకరా ధర జాతీయ రహదారిని అనుకుని రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు పలుకుతోందని, మిగిలిన ప్రాంతంలో రూ.80 లక్షలకు పైగా పలుకుతుందని వివరించారు. ఖరీదైన భూములను నష్టపోవడంతోపాటు జీవనోపాధి పోతుందన్నారు. ప్రభుత్వ ప్రతిపాదనను ముక్తకంఠంతో వ్యతిరేకించారు. యు.కొత్తపల్లి, తొండంగి మండలాల్లో దశాబ్దం క్రితం సేకరించిన కేఎస్‌ఈజెడ్ భూములు ఖాళీగా ఉన్నాయని అవసరమైతే అక్కడకు తరలించాలని కొంతమంది రైతులు సూచించారు. పవిత్రమైన అన్నవరం పుణ్యక్షేత్రాన్ని నో ఫ్లైజోన్‌గా ప్రకటించాలని, ఎయిర్‌పోర్టు రాకతో ప్రశాంతమైన పచ్చని ప్రాంతంలో ధ్వని, పర్యావరణ కాలుష్యంతో పాటు భక్తుల ఏకాగ్రత దెబ్బతింటుందన్నారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటు వల్ల సాగునీటి ప్రవాహానికి అంతరాయం, అనేక సమస్యలు ఉత్పన్నమౌతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎయిర్‌పోర్టును ఇక్కడ నుంచి తరలిస్తామని స్పష్టమైన హామీ వచ్చే వరకు సమష్టిగా ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

భూములిచ్చి నష్టపోయాను



గతంలో నేను పోలవరానికి 9.75 ఎకరాలు, పుష్కర కాలువ కోసం నాలుగెకరాలు, సబ్‌కాలువకు 20 సెంట్లు, జాతీయ హదారికి 1.50 ఎకరాలు భూములిచ్చాను. తక్కువ పరిహారం ఇవ్వడంతో నష్టపోయాను. ఎయిర్‌పోర్టు ప్రతిపాదించిన భూముల్లో నాకు ఏడు ఎకరాలు ఉంది. ఇప్పటికే నష్టపోయిన నాలాంటి రైతులు అనేక మంది ఉన్నాం. మా త్యాగాలను పరిగణలోకి తీసుకుని ఎయిర్‌పోర్టు ప్రతిపాదన విరమించుకోవాలి.

–రాయవరపు వీఎస్ఎస్ఎన్ఎస్ సాయిబాబా, రైతు, బెండపూడి, తొండంగి మండలం

పదెకరాలు నష్టపోతాం



ఎయిర్‌పోర్టు ప్రతిపాదిత ప్రాంతంలో మాకు 10.19 ఎకరాల భూమి ఉంది. తరతరాలుగా భూమినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. ఏటా రెండు పంటలు పండుతుంది. ప్రస్తుతం మార్కెట్ ధర ఎకరాకు రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకూ ఉంది. మొత్తం భూమిని కోల్పోతే జీవనాధారం పోతుంది. ప్రతిపాదనపై ప్రభుత్వం పునరాలోచించాలి. –గోవిందరాజుల వెంకట సోమేశ్వరశాస్త్రి, రైతు, పి.ఇ.చిన్నాయపాలెం

నిరసన జ్వాల

- ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- వైద్య,ఆరోగ్యశాఖ సిబ్బంది ఆందోళనలు
- అయినా పట్టించుకోని పాలకులు



సమస్యలపై విజయవాడలో ధర్నా చేస్తున్న సీహెచ్‌ఓలు

అలమూరు: ప్రజల ఆరోగ్యం కోసం నిత్యం సేవలు అందించే వైద్య, ఆరోగ్య సిబ్బందిలో అసంతృప్తి జ్వాల రగిలింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ తీరును ఖండిస్తూ నిరసనలు తెలుపుతున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆందోళన బాట

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, నేషనల్ హెల్త్ మిషన్‌లో ఒప్పందం ఉద్యోగులుగా పనిచేస్తున్న గ్రేడ్–2 ఏఎన్ఎం, జీఎన్ఎంగా శిక్షణ పొంది వెనక్కి వచ్చిన గ్రామ సచివాలయ ఏఎన్ఎంలు తమ గళాన్ని విప్పుతున్నారు. వైద్య,ఆరోగ్యశాఖలో ఇచ్చిన హామీలకు గ్రహణం పడటంతో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి ఆగ్రహం చెంది ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు చేపట్టారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరసన

ఎన్నికల హామీలను నెరవేర్చాలని కూటమి ప్రభుత్వాన్ని ఉమ్మడి జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు డిమాండ్ చేశారు. దీనిలో భాగంగా ఈ నెల 3వ తేదీ నుంచి తొమ్మిది వరకూ విధులు నిర్వహిస్తూనే మధ్యాహ్న భోజన సమయంలో నిరసనలు తెలిపారు. అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ నెల 21న రాష్ట్ర సీహెచ్ఓ సమాఖ్య పిలుపు మేరకు చలో విజయవాడ పేరుతో అక్కడకు వెళ్లి ఆందోళన నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలందరికీ అంకిత భావంతో సేవలను అందిస్తున్నా తమను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పనిచేస్తున్న 1,428 మందికి ఉద్యోగ భద్రత కల్పించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.

పదోన్నతులు కల్పించాలని..

దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రేడ్ 2 ఏఎన్ఎంలు కోరుతున్నారు. రాష్ట్ర ఎన్‌హెచ్ఎం అసోసియేషన్ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడో సోమవారం ఆయా జిల్లాల కలెక్టరేట్‌లో విజ్ఞాపన పత్రాలను అందజేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు పూర్తవుతున్నా తమ సమస్యలపై స్పందించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. నేషనల్ హెల్త్ మెషీన్‌లో 16 ఏళ్ల నుంచి చాలీచాలని వేతనాలతో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తూ ఇబ్బందులు పడుతున్న తమను రెగ్యులర్ చేసి, గ్రేడ్ –1 ఏఎన్ఎంలుగా పదోన్నతులు కల్పించాలన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 21న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 157 మంది గ్రేడ్ 2 ఏఎన్ఎంలు కాకినాడ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం రూపంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. అక్కడే ఉన్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఒకరు గ్రేడ్ – 2 ఏఎన్ఎంలను ఉద్దేశించి వీరెవ్వరూ తమకు తెలియదంటూ వ్యాఖ్యానించడంతో కార్యాలయం బయటకు వచ్చి నిరసనలు జరిపారు. రీడిప్లమెంట్ పేరిట గ్రేడ్ 2 ఏఎన్ఎంలను ఇష్టానుసారం బదిలీలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో తాము అందిస్తున్న సేవలకు ఇచ్చే పారితోషికాన్ని ఇతర ఉద్యోగులకు జమ చేయడం ఎంత వరకూ సమంజమని ప్రశ్నించారు.

ఎన్నికల సమయంలో హామీల వర్షం

అధికారంలోకి రావడం కోసం ఎన్నికల సమయలో కూటమి నాయకులు వైద్య, ఆరోగ్య సిబ్బందికి అనేక హామీలు ఇచ్చి, నెరవేరుస్తామని వాగ్దానం చేశారు. కానీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఇప్పటి వరకూ పెదవి విప్పడం లేదు. దీంతో విసిగిపోయిన వైద్య, ఆరోగ్య సిబ్బంది నిరసనలు చేపట్టారు. గడచిన సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండు చేస్తున్నారు.

సీహెచ్‌వోల డిమాండ్లు

- కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న సీహెచ్‌ఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలి.
- నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల మాదిరిగా వేతనాలను అందించి టీఏ, డీఏ బిల్లులు చెల్లించాలి.
- రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.25 వేల వేతనానికి అదనంగా రూ.15 వేల పెర్ఫార్మెన్స్ బేస్డ్ ఇన్సెంటివ్ కలిపి ఒక్కొక్క ఉద్యోగికి రూ.40 వేలు అందించాలి.
- పెండింగ్‌లో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ విద్యుత్ బిల్లులు, అద్దె బకాయిలు సత్వరమే విడుదల చేయాలి.
- ప్రావిడెంట్ ఫండ్‌ను పునరుద్ధరించి హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలి.

జీఎన్ఎంల పరిస్థితి ఏమిటి?

గత ప్రభుత్వం 2022 ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 264 మంది గ్రామ మహిళ ఆరోగ్య సంరక్షణ కార్యదర్శులను విద్యార్హతల ఆధారంగా జీఎన్ఎం శిక్షణకు పంపించింది. శిక్షణ పూర్తయిన తరువాత ప్రభుత్వ, ఏరియా ఆస్పత్రుల్లో జీఎన్ఎంలుగా పోస్టింగ్ ఇస్తామని హామీ ఇచ్చింది. రెండేళ్ల పాటు శిక్షణ పొందడంతో పాటు అదనంగా ఆరు నెలల పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలను అందించారు. శిక్షణ పొందే సమయానికి ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అప్పటి ప్రభుత్వం జీఎన్ఎం పోస్టింగ్ ఇవ్వలేకపోయింది. కొత్తగా కొలువు తీరిన కూటమి ప్రభుత్వం మాత్రం గత ప్రభుత్వం ప్రతిపాదనలను పక్కన పెట్టేసింది. అహర్నిశలు శ్రమించి శిక్షణ పొందిన జీఎన్ఎంలను తిరిగి ఏఎన్ఎంలుగా పనిచేసుకోవాలంటూ నాలుగు నెలల తరువాత సొంత ప్రాంతాలకు పంపించి, వారికి తీవ్ర అన్యాయం చేసింది.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలు

వైద్య,ఆరోగ్య శాఖలోని ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర కమిషనరేట్ దృష్టిలోకి తీసుకువెళతామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా డీఎంహెచ్ఓ కార్యాలయాల ప్రతినిధులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో పనిచేస్తున్న సీహెచ్ఓలు, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న గ్రేడ్–2 ఏఎన్ఎంలు సమస్యలపై నివేదిక రూపొందించామన్నారు. శిక్షణ పొందిన జీఎన్ఎంల సమస్య ప్రభుత్వ దృష్టిలో ఉందన్నారు.

- ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను శుభ్రపర్చడం కోసం కంటిజెంట్ వర్కర్‌ను నియమించుకునేందుకు నెలకు రూ.మూడు వేలు కేటాయించాలి.

కాంట్రాక్ట్ గ్రేడ్ –2 ఏఎన్ఎంల డిమాండ్లు

- సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు సమాన పనికి సమాన వేతనం అందించాలి.
- గ్రేడ్–2 ఏఎన్ఎంలకు గ్రేడ్ – 1గా పదోన్నతి కల్పించి రెగ్యులర్ చేయాలి.
- రీడిప్లమెంట్ పేరిట అధికారుల వేధింపులు, బెదిరింపుల నుంచి రక్షణ కల్పించాలి.

క్లుప్తంగా

అంతర్ జిల్లా టెన్నిస్ పోటీలకు సర్వం సిద్ధం

ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకులు



టెన్నిస్ కోర్టులను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు బాబు, వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్–14, 17, 19 విభాగాల్లో సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఎస్‌జీఎఫ్‌ఐ అంతర్ జిల్లాల లాన్ టెన్నిస్ పోటీల ఏర్పాట్లను రాష్ట్ర ఎస్‌జీఎఫ్‌ఐ పరిశీలకులు ఆదివారం పరిశీలించారు. కడప నుంచి ఎస్‌కే బాబు, నెల్లూరు నుంచి వెంకట సుబ్బయ్య బృందం పోటీల నిర్వహణకు ఏర్పాటు చేసిన వివిధ కమిటీల వివరాలను జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి జార్జిని అడిగి తెలుసుకున్నారు. క్రీడాకారులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా వసతి, భోజన, పోటీల నిర్వహణ డ్రా, తాగునీరు, ప్రథమ చికిత్స తదితర అంశాల్లో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వారు డీఎస్‌ఏలోని లాన్ టెన్నిస్ కోర్టులను పరిశీలించారు. వారి వెంట జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ సంయుక్త కార్యదర్శులు సునీల్, పరశురాం, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు, కార్యదర్శి నూకరాజు ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో విజేత తూర్పు



విజేతగా నిలిచిన ఖోఖో తూర్పు గోదావరి జిల్లా బాలికల జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): చిత్తూరు జిల్లా కాణిపాకంలో ఈ నెల 25 నుంచి 27 వరకు జరిగిన అంతర్ జిల్లాల ఖోఖో పోటీలలో తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు ప్రతిభను పరచి ప్రథమస్థానంలో నిలిచింది. ఫైనల్స్‌లో శ్రీకాకుళం జట్టుపై రెండు పాయింట్ల ఆధిక్యంతో విజయం కైవసం చేసుకుంది. దీంతో వరుసగా రెండోసారి రాష్ట్రస్థాయిలో విజయం సాధించిన జట్టుగా తూర్పుగోదావరి జిల్లా జట్టు నిలిచింది. జట్టుకు కోచ్, మేనేజర్లుగా పీడీలు పట్టాభి, వాసు వ్యవహరించారు. కాగా రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన డి.నందిని, డి.సత్య, జి.పావని, ఎన్‌సుహాసినిలను జాతీయ పోటీలకు ఎంపిక చేసినట్టు సెలక్టర్లు తెలిపారు.

తొలి అడుగుకు వేళాయె..

- పదో తరగతి పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల
- అపరాధ రుసుము లేకుండా వచ్చేనెల 11 వరకు గడువు
- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వ పరీక్షల విభాగం



రాయవరం: విద్యార్థి జీవితంలో తొలి పరీక్ష పదో తరగతి గట్టెక్కడం. ఈ పరీక్షలు వచ్చే ఏడాది మార్చి ఏప్రిల్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న రెగ్యులర్/ఫెయిల్ అయిన అభ్యర్థులు ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం పరీక్ష ఫీజు చెల్లింపు వివరాలు ఇలా..

అపరాధ రుసుం లేకుండా వచ్చే నెల 11వ తేదీ లోగా పదో తరగతి పరీక్ష ఫీజు అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవచ్చు. ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు నవంబరు 11వ తేదీలోగా నామినల్ రోల్స్ పూర్తి చేసిన తర్వాత స్కూల్ లాగిన్‌లోని లింక్ ద్వారా మాత్రమే పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. సీఎఫ్‌ఎంఎస్ ద్వారా కాని, చలానా ద్వారా కాని పరీక్ష ఫీజు చెల్లిస్తే నిరుపయోగమవుతుంది. మాన్యువల్ నామినల్ రోల్స్ (ఎంఎన్ఆర్) నేరుగా సంబంధిత డీఈవో కార్యాలయంలో సబ్మిట్ చేయాలి. వచ్చేనెల 12 నుంచి 18వ తేదీలోగా రూ.50 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించవచ్చు. 19నుంచి 25వ తేదీ లోగా రూ.200 అపరాధ రుసుంతో చెల్లించేందుకు అవకాశం ఉంది. ఇక 26 నుంచి 30వ తేదీ వరకు రూ.500 అపరాధ రుసుంతో ఫీజును చెల్లించవచ్చు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి రికగ్నిషన్ పెండింగ్ ఉన్న పాఠశాలల ఆన్‌లైన్ లాగిన్లను ఎనేబుల్ కాలేదు. రికగ్నిషన్ పెండింగ్ ప్రక్రియను పూర్తి చేసుకున్న పాఠశాలలు సంబంధిత డీఈవో కార్యాలయంలో సంప్రదించి, లాగిన్‌ను ఎనేబుల్ చేయించుకోవాల్సి ఉంటుంది. కాగా పైన పేర్కొన్న తేదీల్లో ఏవైనా సాధారణ సెలవు దినాలుంటే తర్వాత పనిదినం రోజున కూడా ఫీజు చెల్లించుకోవడానికి అనుమతిస్తున్నారు.

పరీక్ష ఫీజు ఇలా

రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి పరీక్ష ఫీజు రూ.125 చెల్లించాలని, ఫెయిలైన అభ్యర్థులు మూడు లేదా అంతకన్నా తక్కువ సబ్జెక్టులకు రూ.110, మూడు లేదా అంతకన్న ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, వృత్తి విద్యా కోర్సులు అభ్యసించే విద్యార్థులు, ఎస్ఎస్‌సీ పరీక్ష ఫీజు రూ.125కు అదనంగా మరో రూ.60 చెల్లించాలని ఆయన సూచించారు. తక్కువ వయసున్న విద్యార్థులు (అండర్ ఏజ్ స్టూడెంట్స్) ఫీజుగా రూ.300 చెల్లించాలి. చైల్డ్ విత్ స్పెషల్ నీడ్ (సీడబ్ల్యుఎస్ఎన్) విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించనవసరం లేదు. సదరమ్ సర్టిఫికేట్ లేని వారు సంబంధిత పాఠశాల హెచ్‌ఎం ద్వారా ప్రభుత్వ పరీక్షల విభాగం పంపించిన ఫార్మాట్‌లో సివిల్ సర్జన్ వైద్యుడు ధృవీకరించి సబ్మిట్ చేసే వీలును ప్రభుత్వం కల్పించింది. ఆన్‌లైన్ దరఖాస్తులు www.bre.ap.gov.in వెబ్‌సైట్ నందు అందుబాటులో ఉన్నాయి. పూర్తి చేసిన దరఖాస్తులు అన్నీ ఆన్‌లైన్‌లోనే సబ్మిట్ చేయాల్సి ఉంది.

హెచ్‌ఎంలే బాధ్యత వహించాలి



నామినల్ రోల్స్ సబ్మిట్ చేసే సమయంలో అత్యంత జాగ్రత్తలు వహించాలి. చిన్న తప్పు దొర్లినా సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. నామినల్ రోల్స్‌ను ఒకటికి రెండు సార్లు సరిచూసుకుని మాత్రమే సబ్మిట్ చేయాలి.

– ఎస్.సురేష్, అసిస్టెంట్ కమిషనర్, ప్రభుత్వ పరీక్షల విభాగం, అమలాపురం

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు



పదో తరగతి పరీక్ష ఫీజుల చెల్లింపు విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలి. ఎక్కడైనా అధికంగా వసూలు చేసినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఫీజు చెల్లింపు సమయంలో ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ సూచించిన నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, కాకినాడ

అగ్ని ప్రమాదంలో ఐదు తాటాకిళ్లు దగ్ధం



అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన తాటాకిల్లు

పెదపూడి: ఏపీత్రయం గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున అగ్ని ప్రమాదం సంభవించి ఐదు తాటాకిళ్లు దగ్ధమై ఐదు కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. తహసీల్దార్ పీవీ సీతాపతిరావు మాట్లాడుతూ గ్రామంలో దుర్గాదేవి ఆలయ సమీపంలోని కాలనీల బాధితులు విప్పర్తి విజయ్‌కుమార్, విప్పర్తి రాంబాబు, మంచిమ్మ సుబ్బలక్ష్మి, కర్రి అప్పల నరసమ్మ, లంక సింహాచలం కుటుంబాలతో తాటాకిళ్లలో జీవిస్తున్నారు. తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించి ఐదు ఇళ్లకూ మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో ఇళ్లలో నిద్రిస్తున్నవారు ఒక్కసారిగా ఆందోళన చెంది పిల్లలతో సహా బయటకు వచ్చేశారు. ఏలాంటి ప్రాణనష్టం జరగలేదు. సుమారు రూ.10 లక్షల ఆస్తినష్టం జరిగి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ప్రమాదానికి కారణాలు తెలియలేదు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. కాగా బాధితులను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరామర్శించి అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కాకినాడ రెడ్ క్రాస్‌సొసైటీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. స్థానిక టీడీపీ నేత పెండెం అప్పన్న భోజనం, మాజీ సర్పంచ్ ఆరిమిల్లి సత్య భారతి ఒక్కో కుటుంబానికి రూ.2 వేల ఆర్థిక సాయం అందించారు.

పలు చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్



చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

తుని: రైళ్లలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేశామని తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. జీఆర్పీ ఎస్పీ రాహేల్ దేవ్ సింగ్ ఆదేశాల మేరకు ఆదివారం తుని ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. దీనిలో భాగంగా తుని రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించగా అనకాపల్లి జిల్లా యలమంచిలికి చెందిన నరాలశెట్టి జ్యోతి దుర్గాప్రసాద్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకుని విచారించారు. నిందుతుడు వద్ద నాలుగు కేసుల్లో 42 గ్రాములు బంగారు అభరణాలు, రూ.6 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామని ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



గోదావరి జలాలతో స్వామివారిని అభిషేకిస్తున్న అర్చకులు

- ఘనంగా వాడపల్లి వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు
- కన్నుల పండువగా గజవాహన సేవ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆదివారం స్వామి వారికి కల్యాణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు రాజాధిరాజ అలంకరణతో గజవాహనంపై ఊరేగించారు. స్వామి వారికి ఎమ్మెల్యే బండారు సత్యనందరావు దంపతులు, దేవాదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఈఓ నల్లం చక్రధర్‌రావు దంపతులు పట్టు వస్త్రాలను అందించారు. ఉదయం స్వామివారికి తీర్థ బిందెతో గోదావరి జలాలను తీసుకువచ్చి సుప్రభాత సేవ, అభిషేకాలు, నిత్య హోమాలు చేశారు. అనంతరం నివేదన, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. వైఖానస యువబ్రహ్మ ఆగమ భాస్కర ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో పూజలు, సేవలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, విశేషార్చన, పంచామృత మంటపారాధన, మహస్నపనం, ప్రధాన హోమాలు, దిగ్దేవతా బలిహరణ, శ్రీనివాసకల్యాణం, నీరాజన మంత్రపుష్పం, స్వస్తివచనం, ప్రధానహోమాలు, విశేష అర్చన, చతుర్వేద స్వస్తి, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్సై రాము ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

గజవాహన సేవ విశిష్టత

శ్రీవారిని గజేంద్రుడు మోస్తున్నట్లు భక్తులు కూడా నిరంతరం వేంకటపతిని హృదయంలో ఉంచి శరణాగతి పొందాలని ఈ వాహనోత్సవ సేవలో అంతర్యం. ఈ వాహన సేవ దర్శనంతో కర్మ విముక్తి కలుగుతుందని పురాణాల ద్వారా తెలుస్తోంది. సోమవారం స్వామివారికి అశ్వవాహన సేవ నిర్వహించనున్నట్టు అధికారులు తెలపారు.

బాలబాలాజీ స్వామికి తిరుమంజన సేవ



బాల బాలాజీ స్వామికి తిరుమంజన సేవ చేస్తున్న అర్చకులు

మామిడికుదురు: మనసా వాచా, కర్మేణా జరిగే దోషాలకు పరిహారంగా చేపట్టిన పవిత్రోత్సవాలు అప్పనపల్లి బాల బాలాజీ స్వామి క్షేత్రంలో ఆదివారం ఘనంగా జరిగాయి. చతుస్థానార్చనలతో ప్రారంభమైన పవిత్రోత్సవాల్లో అగ్ని ప్రతిష్ఠాపన, పవిత్రారోహణ పూజ లను శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామితో పాటు పద్మావతి దేవి, ఆండాళ్‌తాయార్ అమ్మవార్లకు 27 కలశాలతో పంచామృతాలు, సుగంధ ద్రవ్యం, 11 రకాల ఫల రసాలు, ఉద్గ జలాలతో తిరుమంజన సేవ నిర్వహించారు. ఈఓ ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి శిష్య బృందం గుడివాడకు చెందిన చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను వైభవంగా జరిపించారు.

రత్నగిరికి రెండు బస్సులు

- ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యప్రభ
- రూ.80.6 లక్షలతో కొనుగోలు
- అన్నవరం రైల్వే స్టేషన్, కాంప్లెక్స్‌ల నుంచి కొండపైకి తిరిగేలా ఏర్పాట్లు

అన్నవరం: సత్యదేవుని ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం అధికారులు రెండు కొత్త బస్సులను ఆదివారం ప్రారంభించారు. రత్నగిరిపై జరిగిన కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఈ బస్సులకు జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ బస్సుల వలన అన్నవరం రైల్వేస్టేషన్, బస్టాండ్ నుంచి సత్యదేవుని ఆలయానికి రాకపోకలు సాగించే భక్తులకు చాలా సౌకర్యవంతంగా ఉంటుందని ఈఓ రామచంద్ర మోహన్ తెలిపారు.



రత్నగిరిపై దేవస్థానం బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్ తదితరులు

గత జూలై నెలలో రూ.57 లక్షలతో అశోక్ లేలాండ్ కంపెనీకి చెందిన రెండు బస్సు చాసిస్‌లను కొనుగోలు చేశారు. వాటిని అదే నెలలో నందిగామలోని బాడీ బిల్డింగ్ సెంటర్‌కు తరలించి ఒక్కో బస్సులో 40 ప్లస్ వన్ సీటింగ్ సామర్థ్యంతో బాడీ బిల్డింగ్ చేయించారు. బాడీ బిల్డింగ్‌కు సుమారు రూ.23.6 లక్షలు ఖర్చు చేశారు. ఈ బస్సుల చాసిస్ కొనుగోలు, బాడీబిల్డింగ్‌కు మొత్తం రూ.80.6 లక్షలు వ్యయమైందని ఈఓ వివరించారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

- 425 గ్రాముల వెండి వస్తువుల చోరీ
- కేసు నమోదు చేసిన పోలీసులు

పి.గన్నవరం: మండలంలోని నరేంద్రపురం గ్రామంలో శనివారం అర్ధరాత్రి దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేశారు. ఒక ఇంటి తాళాలు పగులగొట్టి 425 గ్రాముల వెండి వస్తువులను అపహరించుకుపోయారు. మరొక ఇంటిని పగుల గొట్టి సామాన్లను చిందరవందర చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నరేంద్రపురం గ్రామానికి చెందిన గరిమెళ్ల సీతారామశర్మ ఇటీవల హైదరాబాద్ వెళ్లారు. ఆయన ఉంటున్న ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని ఆదివారం ఉదయం స్థానికులు గమనించి, ఆయన సోదరుడైన గరిమెళ్ళ వెంకట సూర్య సుబ్రహ్మణ్యానికి తెలిపారు. దీంతో ఆయన హైదరాబాద్‌లో ఉన్న శర్మకు సమాచారం అందించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బీరువాలో ఉంచిన 425 గ్రాముల వెండి వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించారు. ఈ మేరకు శర్మ సోదరుడు సుబ్రహ్మణ్యం ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఇంటిని ఎస్సై బి.శివకృష్ణ పరిశీలించారు. చోరీ జరిగిన ఇంటిని క్లూస్ టీమ్ సభ్యులు పరిశీలించి వేలి ముద్రలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ వివరించారు.

మరో ఇంటిలో..

అదే గ్రామంలో నివశిస్తున్న అయ్యగారి సూర్యనారాయణ మూర్తి ఇటీవల విజయవాడలోని కుమారుని ఇంటికి వెళ్లారు. ఆయన ఇంటి తాళాలను కూడా శనివారం అర్ధరాత్రి దొంగలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించినట్టు స్థానికులు తెలిపారు. ఇంట్లోని రెండు బీరువాలను పగులగొట్టి, సామాన్లు చిందర వందరగా పడేసినట్టు స్థానికులు వివరించారు. సూర్యనారాయణ ఇంకా నరేంద్రపురానికి రాకపోవడంతో వివరాలు తెలియరాలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు. అలాగే ఎస్.సూరిబాబు ఇంటి తాళాలను పగుల గొట్టేందుకు దొంగలు ప్రయత్నించి విఫలం అయ్యారని స్థానికులు తెలిపారు.



నరేంద్రపురంలో చోరీ ఘటనపై వివరాలు సేకరిస్తున్న పోలీసులు

యువకుడిపై పోక్సో కేసు

కోటనందూరు: ప్రేమ పేరుతో బాలికను మోసగించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.రామకృష్ణ ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని కేఏ మల్లవరం గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన రాపాక ప్రసాద్ ప్రేమ పేరుతో వంచించి మోసగించాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అధికారి, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు బాధితురాలి ఇంటికెళ్లి దర్యాప్తు చేసి వివరాలు సేకరించారు.



కేఏ మల్లవరంలో దర్యాప్తు చేస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

● సాయం సంధ్యకు సిందూరపు కోక



ప్రకృతి చిత్రాలను ఆస్వాదించాలంటే రెండు కళ్లెక్కడ సరిపోతాయి.. ఏ ఆవర్తనాలు ఎలా పరావర్తనమవుతాయో ఎవరు చెప్పగలరు.. సహజంగా పచ్చని పైర్లతో నిండిన నేల పచ్చని కోక కట్టినట్టు.. ఏ గోదారి పరవళ్లో గలగలా పారుతుంటే నీలాకాశపు కాంతి పడి నీలిరంగే లేతగానో.. ముదురుగానో కనపడడం సహజం. కానీ ఇక్కడ చిత్రం మరీ విచిత్రంగా సిందూర వర్ణపు ఆకాశపు కాంతి ఇక్కడి నీటిపై పరావర్తనం చెంది అదే రంగునలదుకుని ఎంత సుందరంగా కనిపిస్తోందో.. మనసుతో మరో కోణంలో చూస్తేనే ఈ దృశ్యానికి పులకించగలం. గోకవరం శివారున రాజుచెరువు సమీపంలో ఆదివారం సాయంత్రం సూర్యాస్తమయంలో సిందుర వర్ణపు కాంతుల్లో మెరిసిపోతున్న భూమ్యాకాశాలు ఎంత హృద్యంగా ఉన్నాయో కదా.

– గోకవరం

సంఘ పరంగా నటులకు తోడ్పాటు



మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సినీనటుడు గౌతంరాజు

- సినీ నటుడు గౌతం రాజు
- మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ పోస్టర్ ఆవిష్కరణ

బోట్‌క్లబ్: నూతన నటులకు, కాకినాడలో ఉన్న నటులకు సంఘ పరంగా వివిధ సినిమాల్లో అవకాశాలు కల్పించడం కోసం మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ప్రారంభించామని సినీ నటుడు గౌతమ్ రాజు తెలిపారు. స్థానిక దంటు కళాక్షేత్రంలో ఆదివారం అసోసియేషన్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు కళలకు పుట్టినిల్లుగా ఉన్న కాకినాడలో అసోసియేషన్ ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కాకినాడ కేంద్రంగా ఈ అసోసియేషన్ తన సేవలను అందిస్తుందన్నారు. సంఘ సభ్యులకు అన్ని సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కాకినాడలో పుట్టి పెరిగిన తనకు ఈ ప్రాంతంలో వారికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఇక్కడ అసోసియేషన్ ప్రారంభించి, ఇక్కడ నటీనటులకు తన వంతు సహాయం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి అధ్యక్షుడు మార్ని జానకీరామచౌదరి, యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ సెక్రటరీ ప్రభుదాసు, పలువురు నటీనటులు పాల్గొన్నారు.

స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీస్ అసోసియేషన్ ఎన్నిక

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం స్థానిక డీఈఓ కార్యాలయంలో ఏకగ్రీవంగా జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ఎం.రవికుమార్, సహాయ అధ్యక్షుడిగా కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఏవీ ఉమామహేశ్వరరావు, సీహెచ్ శ్రీనివాస్, ఎస్.నూకరాజు, కె.సత్య ఉమాదేవి ఎన్నికయారు. వీరితో పాటు ప్రధాన కార్యదర్శిగా టి.శ్రీనివాస్, కార్యదర్శులుగా జి.కామేశ్వరి, టి.రామ సత్యానందం, కేవీజీ కృష్ణరాజన్, ఆర్.సోమలమ్మ, మహిళా కార్యదర్శిగా శైలజ సుందరి, కోశాధికారిగా పి.దుర్గా మనోహర్ ప్రమాణ స్వీకారం చేశారు.